ప్రజాశక్తి

మంగళవారం 28 ఫిబ్రవరి 2023 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

1 నుంచి విజయ పాల ధర పెంపు

లీటరుకు రూ.2 చొప్పున పెరుగుదల

ప్రజాశక్తి - వన్‌టౌన్

ఖర్చులు పెరిగిన దృష్ట్యా మార్చి 1వ తేదీ నుంచి అనివార్య పరిస్థితుల్లో విజయ పాల ధరలను ప్యాకెట్‌కు రూపాయి చొప్పున పెంచుతున్నట్లు కృష్ణా మిల్క్ యూనియన్ మేనేజింగ్ డైరక్టర్ కొల్లి ఈశ్వరబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తంగా లీటరు పాలకు రెండు రూపాయలు పెరుగుతుందని తెలిపారు. పాలకు సంబంధించి చిన్న ప్యాకెట్లు, పెరుగు, ఇతర పాల పదార్థాల ధరల్లో ఎటువంటి మార్పులేదని తెలిపారు. పశుపోషణ, నిర్వహణ ఖర్చులు, రైతుల నుంచి పాల సేకరణ ఖర్చులు, ముడి సరకులు, రవాణా ఖర్చులు పెరిగినందున అనివార్య పరిస్థితుల్లో పాల ధరలను పెంచుతున్నట్లు తెలిపారు.

నేడు మినీ జాబ్ మేళా

370 ఉద్యోగాల భర్తీకి వివిధ కంపెనీల రాక

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

విజయవాడ ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రాంగణంలోని ఎన్టీఆర్ జిల్లా ఉపాధి, శిక్షణ (ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్) కార్యాలయంలో మంగళవారం మినీ జాబ్ మేళా నిర్వహించనున్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, పాలిటెక్నిక్, ఫార్మసీ, బిటెక్‌తోపాటు పిజి విద్యార్హతలున్న స్త్రీ, పురుష నిరుద్యోగులకు ఏపిఎస్ఎస్‌డిసి, సీడాప్, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ జాబ్ మేళాలో అపోలో ఫార్మసీ, జాస్ అలుకాస్, బైజూస్, ఇన్నోవ్‌సోర్స్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్, టెక్నోటాస్క్ బిజినెస్ సోల్యుషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర సంస్థల ప్రతినిధులు ఈ మేళాలో పాల్గొంటున్నారు. ఈ మేళా ద్వారా సంస్థల్లోని సుమారు 370 ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. బైజూస్‌లో 50, ఇన్నోవ్‌సోర్స్ సర్వీసెస్‌లో 100, అపోలో ఫార్మసీలో 150, జాస్ అలుకాస్‌లో 40, టెక్నోటాస్క్ బిజినెస్ సోల్యుషన్స్‌లో మరో 30 ఉద్యోగాలకుగాను నియామకాలు చేపట్టనున్నారు.

గ్రామాల్లో సమస్యలు తిష్ట

స్థానిక సంస్థలకు నిధుల కొరత ముందుకు సాగని అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

గ్రామీణ ప్రాంతాల్లో అనేక సమస్యలు తిష్టవేశాయి. లక్ష్యం పూర్తయిందనే కారణంతో ధాన్యం సేకరణ నిలిపివేయడంతో రైతాంగానికి సమస్యగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు అస్తవ్యస్తంగా మారాయి.



వ్యవసాయ ప్రాధాన్యత కలిగిన కృష్ణాజిల్లాలో ఈ ఏడాది సైతం పంటలు అమ్ముకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 5.20 లక్షల టన్నుల ధాన్యం ఆర్బీకెల ద్వారా ప్రభుత్వం సేకరించింది. లక్ష్యం పూర్తయిందనే కారణంతో గత కొన్ని రోజులుగా సేకరణను ప్రభుత్వం నిలిపివేసింది. లక్ష్యాన్ని మరో 2 లక్షల టన్నులు పెంచితే గానీ రైతులు తమ వద్ద ధాన్యాన్ని ఆర్బీకెల్లో అమ్ముకోగలుగుతారు. జిల్లా పరిషత్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని గతంలో నిర్ణయించారు. దీనికి కమిటీ వేస్తామని ప్రకటించారు. ఇప్పటి వరకుక జడ్‌పి ఆస్తుల నిర్ధారణ పూర్తి కాలేదు. జడ్పీ పాఠశాలల్లో పిల్లల సంరక్షణకు వాచ్‌మెన్‌లు నియామకాలు చేపట్టాలని స్థాయి సంఘ సమావేశాల్లో చర్చించారు. రహదారులు, గ్రామాల్లో పారిశుధ్యం లోపం వంటి ప్రధాన సమస్యలు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో అంతర్గత రహదారులు, గ్రామాలకు, మండల కేంద్రాలకు మధ్య రహదారులు అధ్వానంగా మారాయి. వీటిపై ప్రయాణించాలంటే వాహనదారులు, ముఖ్యంగా ద్విచక్ర వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ సచివాలయాలు, ఆర్బీకెలు, డిజిటల్ లైబ్రరీల నిర్మాణం నిధులు లేక నీరసించింది. మధ్యస్థ స్థితిలో నిర్మాణాలు నిలిచిపోయాయి. వీటి పూర్తికి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

జిల్లా పరిషత్‌లకు ఆర్థిక సంఘం నిధులు మాత్రమే ఆదాయ వనరు. వాటిని నిర్ణీత కాలంలోనే స్థానిక సంస్థలకు కేంద్రం జమచేస్తోంది. వాటిని ఆయా నిష్పత్తుల ప్రకారం జిల్లా, మండల పరిషత్‌లకు కేటాయించాలి. ఈ నిధులను గతంలో మాదిరిగానే ఆయా మండలాలకు జిల్లా పరిషత్ నుంచి కేటాయి నిధులు కేటాయిస్తారు. అయితే 15 ఆర్థిక సంఘం నిధులు రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించింది. దీంతో ఆ నిధులతో చేపట్టే మంచినీటి పథకాల నిర్వహణ, మరమ్మతులు వంటి వాటికి నిధులకు కొరత వెంటాడుతుంది. అలాగే గ్రామాల్లో పారిశుధ్య సమస్య పరిష్కరించడానికి పాలకవర్గాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. కొన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు గాలికి వదిలేశారు. వైసిపిలో అంతర్గత కుమ్ములాటలు పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకంగా మారాయి. జడ్పీ చైర్‌పర్సన్, మంత్రి మధ్య ఉన్న విబేధాలతో పెడన నియోజకవర్గంలో 10వ తరగతి స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందించడంలో జాప్యం జరిగింది. తాగునీటి సరఫరాలో కీలకమైన మైక్రో ఫిల్టర్‌బెడ్‌లు గుడివాడ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పూర్తవ్వగా, పెడన నియోజకవర్గంలో పట్టాలెక్కలేదు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు విడుదలపై హామి ఇచ్చారు. నెలలు గడిచినా ఆచరణకు నోచుకోలేదు.

జిపిఎస్ ఎత్తిపోతలపై శీతకన్ను

దశాబ్దకాలంగా అభివృద్ధికి దూరం గుర్రపుడెక్కతో నిండిన కాల్వ



ప్రజాశక్తి - విజయవాడ రూరల్ :

రెండు జిల్లాల్లో ఆరున్నర వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించే గొల్లపూడి ఎత్తిపోతల పథకం (జీపీఎస్) కాల్వ నిర్లక్ష్యానికి గురవుతోంది. ఏటా చేపట్టే ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులు కూడా జరగకపోవడంతో కాల్వలో గుర్రపుడెక్క, తూటుకాడ పెరిగిపోయింది. దీనిని తొలగించి ఈ ఖరీఫ్ కైనా ఆయకట్టు చివరి భూములకు సాగునీటిని సరఫరా చేస్తారా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. వేలాది ఎకరాలకు సాగునీటిని అందించే జీపీఎస్ కాల్వ అభివద్ధి పట్ల జలవనరులశాఖ అధికారులు శ్రద్ధ చూపకపోవడం విమర్శలకు తావిస్తోంది. సుమారు 15 కిలోమీటర్ల పొడవున ప్రహించే జీపీఎస్ కాల్వను నీటిపారుదల ఆయకట్టు అభివద్ధి సంస్థ (ఐడీసీ) పరిధిలోకి తెచ్చినప్పటి నుంచి అభివద్ధి అనే మాట వినిపించడం లేదు. అధికారులు కాల్వ పరీవాహక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న దాఖలాలు సైతం లేవు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో కష్ణానది నుంచి నీటిని లిఫ్ట్ చేసి ఈ కాల్వలోకి విడుదల చేస్తారు. ఎన్టీఆర్ జిల్లాలోని గొల్లపూడి, జక్కంపూడి, అంబాపురం, పీ నైనవరం, పాతపాడు, కుందావారి కండ్రిక, నున్నతోపాటు కష్ణాజిల్లా గన్నవరం మండలం ముస్తాబాద పెద చెరువు వరకు ఈ కాల్వ ద్వారా నీరందుతుంది. ఏటా ఖరీఫ్, రబీ సీజన్లో కాల్వకు నీటిని విడుదల చేసేవారు. కాల్వ పలుచోట్ల పూడుకుపోవడం, తూటుకాడ, గుర్రపుడెక్క ఉండటంతో కొన్నాళ్ల నుంచి ఖరీఫ్‌లోనూ సక్రమంగా నీళ్లు రావడం లేదని రైతులు చెబుతున్నారు. ఈ కాల్వ నుంచి కుందావారి కండ్రిక, పాతపాడులోని జై కిసాన్ ఉప ఎత్తిపోతల పథకం, నున్నలో యూపీ రాఘవేంద్రరావు ఉప ఎత్తిపోతల పథకం కింద చెరువులకు నీటిని సరఫరా చేయాల్సి ఉంది. నున్న ప్రజలకు తాగునీటిని కూడా ఈ కాల్వే అందిస్తుంది. అలాంటి కాల్వను దీర్ఘకాలం నుంచి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. కాల్వ పొడవునా షటర్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. కాల్వ కట్టలు సైతం ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకోని పరిస్థితి ఉది. మరో నాలుగు నెలల్లో ఖరీఫ్ సీజన్ మొదలవుతున్నందున యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని, గుర్రపుడెక్కను, తూటుకాడను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

ఆటల పోటీల్లో క్రీడా స్ఫూర్తి అవసరం

మంత్రి తానేటి వనిత ఉత్సాహంగా ఎస్‌విఎస్ ప్రసాద్ మెమోరియల్ రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : గెలుపోటములతో సంబంధంలేకుండా క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేటలోని ఎస్‌జిఎస్ కళాశాల ప్రాంగణంలో సోమవారం ఎస్‌విఎస్ ప్రసాద్ మెమోరియల్ రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలను ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు సామినేని ఉదయభానుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మహిళా పక్షపాతి అన్నారు. రాష్ట్రస్థాయిలో ఇటువంటి మహిళా కబడ్డీ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇటువంటి క్రీడలు గ్రామీణ ప్రాంత మహిళా క్రీడాకారులకు ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటాయన్నారు. ప్రభుత్వ విప్, స్థానిక ఎంఎల్‌ఎ సామినేని ఉదయభాను మాట్లాడుతూ తమ సోదరులైన సామినేని



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న హోం మంత్రి తానేటి వనిత, చిత్రంలో ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ సామినేని ఉదయభాను, నందిగామ ఎంఎల్‌ఎ మొండితోక



పోటీల ప్రారంభోత్సవం సందర్భంగా క్రీడాకారులతో కబడ్డీ ఆడుతున్న మంత్రి తానేటి వనిత

వెంకట మల్లికార్జున ప్రసాద్ (ఎస్‌విఎం ప్రసాద్) మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈపోటీలకు 13 జిల్లాల నుంచి ప్రముఖ టీమ్‌లు వచ్చాయన్నారు. చివర రోజున జరిగే బహుమతి ప్రదానోత్సవానికి మంత్రి రోజా రానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఎంఎల్‌ఎ మొండితోక జగన్మోహన్ రావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కెడిసిసిబి చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ ముత్తినేని విజయ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ భవనానికి మంత్రి ప్రారంభోత్సవం

వత్సవాయి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సొసైటీల అభివద్ధికి ఎంతో కషి చేస్తున్నారని రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. వత్సవాయిలో రూ.86.25 లక్షలతో నూతనంగా నిర్మించిన సొసైటీ భవనం ప్రారంభోత్సవం, డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహావిష్కరణ, ఎఫ్‌పిఒ కలెక్షన్ సెంటర్ శంకుస్థాపన కార్యక్రమాల్లో మంత్రి తానేటి వనిత, రాష్ట్ర ప్రభుత్వవిప్, ఎంఎల్‌ఎ సామినేని ఉదయభాను పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ (మిగతా 6లో)

కబడ్డీ పోటీల్లో లక్ష్మికి రజితం

ప్రజాశక్తి-తిరువూరు: జాతీయ స్థాయి కబడ్డీ పోటీలలో తిరువూరు మండలం ముష్టికుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయిని డి.లక్ష్మీ రజిత పతకం సాధించారు. ఇటీవల ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో అఖిల భారత సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల జాతీయ కబడ్డీ పోటీలు జరిగాయి.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున లక్ష్మీ పాల్గొని రజత పతకాన్ని సొంతం చేసుకున్నారు. ఫిబ్రవరి మొదటి పక్షంలో మిడ్నపూర్‌లో జరిగిన జాతీయ సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్స్ పోటీలలో 400 మీటర్ల రిలే పరుగు పందెంలో కూడా లక్ష్మీ రజత పతకంతో పాటు షాట్ పుట్, 200 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకాలు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈలప్రోలు కేశవరావు తెలిపారు. ఒకే నెలలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు క్రీడాంశాల్లో రెండు రజత, రెండు కాంస్య పతకాలు సాధించి పాఠశాలకు జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తీసుకొచ్చారని కొనియాడారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో లక్ష్మిని ప్రధానోపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షులు వి.చెన్నకేశవరావు, ఉపాధ్యాయులు వెంకటేష్, ప్రతాపరెడ్డి, సర్దార్ నాయక్, ప్రసాద్, సుధాకర్, రామకుమార్, నాగేశ్వరరావు గ్రామ పెద్దలు అభినందించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్

ఆరోగ్యం పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి- వన్‌టౌన్: ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ అన్నారు. ద్వారావతి ఫౌండేషన్, కెబిఎన్ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన మోహన్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల జీవన విధానంలో మార్పు వచ్చిన తరువాత ఆరోగ్య సమస్యలు సైతం పెరుగుతున్నాయన్నారు. మారుతున్న జీవనశైలిని పక్కనపెట్టి ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని కొనసాగించాలని సూచించారు. ద్వారావతి ఫౌండేషన్ సమాజానికి మంచి సేవలందిస్తుందని కొనియాడారు. కళాశాల కార్యదర్శి తూనుకుంట్ల శ్రీనివాసు మాట్లాడుతూ ఇటీవల కరోనా వంటి మహమ్మారి కబళించిన తరువాత ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయన్నారు. సరైన జీవనశైలిని అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నారాయణరావు, ద్వారావతి ఫౌండేషన్ చైర్మన్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ గౌతమ్ విద్యాసంస్థల రజతోత్సవం

ప్రజాశక్తి-వన్‌టౌన్: శ్రీ గౌతమ్ విద్యాసంస్థల రజతోత్సవ వేడుకలు వైఎస్ఆర్ కాలనీ బ్రాంచ్‌లో పాఠశాల డైరెక్టర్ ఎన్.సూర్యారావు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, అతిథులుగా నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, దుర్గగుడి మాజీ చైర్మన్ పైలా సోమినాయుడు, ఏడిసిపి క్రైమ్స్ ఎన్‌టిఆర్ జిల్లా పి.వెంకటరత్నం, ఎంపిటిసి సత్యనారాయణ, పట్నాయక్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి రజతోత్సవ వేడుకలను పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రతిభకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ పి.తులసి పర్యవేక్షించగా ఇన్చార్జిలు శ్రీరామ్, రమ, ఉమ, రేష్మా మధులత, యమున పాల్గొన్నారు.



ఎక్సెల్‌ప్లాంట్లో పనులు పూర్తి చేయాలి : కమిషనర్



ప్రజాశక్తి-విజయవాడ: సింగ్‌నగర్ ఎక్సెల్‌ప్లాంట్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఎక్సెల్‌ప్లాంట్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని కమిషనర్ సోమవారం పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ప్లాంట్ ఆవరణలో మిగిలిపోయిన సిసి రోడ్లను వేయాలని, కొత్తగా ఆఫీసు బిల్డింగ్‌ను నిర్మాణం చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. కాల్-ఆన్ ఇండస్ట్రీస్ వారి నిర్వహణలో చెత్త వేయింగ్ (వే బ్రిడ్జి) పని తీరును పరిశీలించారు. ప్లాంట్ ఆవరణలో ప్రహరీ గోడ ప్రక్కన ఏర్పాటు చేసిన గ్రీనరీని పరిశీలించి ఖాళీగా ఉన్న ప్రదేశములో పూర్తి స్థాయిలో గ్రీనరీని అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, జోనల్ కమిషనర్-2 యు.సజన, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సత్యనారాయణరావు, ఏ.ఎస్.ఎన్ ప్రసాద్, ఏ.డి.హెచ్ శ్రీనివాసు పాల్గొన్నారు.

పన్నులు సకాలంలో చెల్లించండి

వివిధ రకాల పన్నులు సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ నగర ప్రజలను కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ...విజయవాడ నగరంలో ఆస్తి పన్నులు, నీటి చార్జీలు, వాటర్ మీటర్ పన్నులు, డ్రైనేజ్ పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు తదితర అన్ని రకాల పన్నులను వెంటనే చెల్లించాలని కోరారు. లేనట్లయితే నీటి కుళాయి కనెక్షన్లను తొలగించడంతో పాటు సదరు ఆస్తులను జప్తు చేయడం జరుగుతుందని కమిషనర్ హెచ్చరించారు. మార్చి 31తో ఈ ఆర్థిక సంవత్సరం ముగుస్తుందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో సెలవు రోజుల్లో కూడా రెవెన్యూ వసూళ్ల కేంద్రాలు యథావిధిగానే పని చేస్తున్నాయని అన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-విజయవాడ: నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో పెజ్జోనిపేటలోని నీతోడు మానసిక వికాస కేంద్రంలో నవజీవన్ పూర్వ విద్యార్థుల కుటుంబాలకు నిత్యావసర సరుకులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నవజీవన్ బాల భవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ యన్ రత్నకుమార్ మాట్లాడుతూ బాలల పెరుగుదలకు కుటుంబ వ్యవస్థ ముఖ్యపాత్ర వహిస్తుందన్నారు. డాన్‌బాస్కో నవజీవన్ బాల భవన్ బాలల అభివృద్ధి, కుటుంబ సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు, సైకాలజిస్ట్ జి.అనూష, జోనల్ కోఆర్డినేటర్స్ జె ఆంజనేయులు, ఎండి వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.





ఆక్రమిత స్థలంలో మట్టి తొలగింపు

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ నగరంలోని బుడమేరు సమీప స్థలాలు కొనుగోలు చేసే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చీఫ్ సిటీ ప్లానర్ జివిజిఎస్‌వి ప్రసాద్ అన్నారు. 58వ డివిజన్ ఇందిరానాయక్ నగర్, పోస్టుమ్యాన్ రామచంద్రరావు వీధిలోని 4వ దక్షిణ క్రాస్ రోడ్డులో గత శనివారం (25న) నుంచి ఆర్ఎస్ నెంబర్ 63 బుడమేరుకు సంబంధించిన భూమి మెరక ఆక్రమణ చేసి, ఇంటి నివేశన స్థలంగా మార్పు చేసే ప్రయత్నాన్ని గమనించిన సర్కిల్-2 అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలాజి నేతృత్వంలో సదరు చదును చేసిన ఎంతో విలువైన స్థలాన్ని జెసిబితో సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా ఎసిపి బాలాజి మాట్లాడుతూ...బుడమేరు పరిసర ప్రాంతాల్లో స్థలాలు కొనుగోలు చేసే సమయములో తగిన అనుమతులు ఉన్నాయా లేవా అని పరిశీలించి తీసుకోవాలని కోరారు. మునిసిపల్ లైసెన్స్ సర్వేయర్, ఇంజినీర్లను సంప్రదించి రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల నుంచి ఎన్ఓసి (నిరభ్యంతర ధృవపత్రం) తెచ్చుకొని స్థలాలు కొనుగోలు చేయాలని కోరారు. అలా చేయకుండాచట్ట విరుద్ధంగా కొనుగోలు చేసినట్లయితే అవసరమైన మౌలిక సదుపాయాలు మంజూరు కాకుండా చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కమిషనర్ హెచ్చరించినట్లు ఎసిపి బాలాజి తెలిపారు.

భర్త హత్య కేసులో భార్య, ప్రియుడు అరెస్టు

ప్రజాశక్తి-కంచికచర్ల: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తను అతని భార్య ప్రియుడు, అతని స్నేహితులతో కలిసి హత్యకు పాల్పడిన ఘటనలో నిందితులను అరెస్టు చేసి నందిగామ కోర్టులో హాజరు పరిచినట్లు నందిగామ ఏసిపి జి.నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. కేసు వివరాలను సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏసిపి తెలిపారు. వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామానికి చెందిన కుంచం రామారావు (45) రేషన్ డీలర్‌గా పని చేస్తున్నారు. భార్య భార్గవి కంచికచర్ల మండలం మొగులూరు గ్రామంలో ఎఎన్ఎంగా ఉద్యోగం రావడంతో కంచికచర్ల పెద్ద బజారులో ఒక ఇంటిని అద్దెకు తీసుకొని నివసిస్తున్నారు. గతంలో జెసిబి నడిపిన రామారావు వద్ద జుజ్జూరుకు చెందిన మొగులూరి ప్రవీణ్ ఆపరేటర్‌గా పని చేశాడు. ఈ పరిచయంతో రామారావు ఇంటికి ప్రవీణ్ తరుచూ వస్తున్న క్రమంలో భార్గవితో అక్రమ సంబంధం ఏర్పడింది. వీరిద్దరిని రామారావు పలుమార్లు హెచ్చరించాడు. ఈ నేపథ్యంలో తమ సంబంధానికి అడ్డుగా ఉన్న రామారావు అడ్డు తొలగించాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 24న రాత్రి సమయంలో భార్గవి, ప్రవీణ్ తన స్నేహితులైన మొగులూరు బుచ్చిబాబు, పులి సురేష్ సహాయంతో రామారావు తలకు కవరు తగిలించి ఊపిరాడకుండా చేశారు. దీంతో రామారావు గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చే సమయానికి ప్రవీణ్, బుచ్చిబాబు, సురేష్ వారి వాహనాన్ని అక్కడే వదిలి పారిపోయారు. రామారావుని వెంటనే 108లో నందిగామ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. రామారావు తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అదుపులోకి కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో నిందితులను 48 గంటల్లో పట్టుకున్న సిఐ ఐవి నాగేంద్ర కుమార్, ఎస్సై సుబ్రహ్మణ్యంలను ఏసిపి అభినందించారు.



మాట్లాడుతున్న ఏసిపి నాగేశ్వర్ రెడ్డి



దోమల బారి నుండి ప్రజలను కాపాడండి

ప్రజాశక్తి-సింగ్‌నగర్: దోమల బారి నుంచి ప్రజలను కాపాడాలని 58వ డివిజన్ పైపుల రోడ్డు వద్ద సిపిఐ నాయకులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాలను కార్పొరేషన్ గాలికి వదిలేయడం సరికాదన్నారు. వెంటనే దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా దోమలు బాబోయ్ దోమలు అంటూ హాస్యనాటిక ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కె.వి.భాస్కరరావు, మల్లి పట్నాయక్, లక్ష్మీ, ఎన్ లక్ష్మీనారాయణ, ఎల్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ భూములకు వేలం

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: శ్రీ తిరుపతమ్మ అమ్మవారికి సంబంధించిన వివిధ వ్యవసాయ భూములను సాగు చేసుకునేందుకు సోమవారం ఆలయం వద్ద బహిరంగ వేలం పాటలు అధికారులు నిర్వహించారు. మూడు సంవత్సరాల పాటు ఈ భూములను కౌలు చేసేందుకు వేలం పాటలు నిర్వహించారు. అలాగే అమ్మవారి ఉత్సవాల సందర్భంగా మార్చి ఏడవ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఎగ్జిబిషన్ నిర్వహించుకునేందుకు వేలం పాట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్న కేశవరావు, కార్యనిర్వాహణాధికారి లీలా కుమార్, ధర్మకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

రైటప్: అర్జీలను స్వీకరిస్తున్న ఎసి(జ) శ్యామల

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

ప్రజాశక్తి-భవానీపురం: కబేళా విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని 11 కెవి లలితానగర్ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా ఈనెల 28వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు జోజినగర్, లలితా నగర్, పోలీస్ కాలనీ, టెలిఫోన్ కాలనీ, నేతాజీ స్కూల్ రోడ్డు, నూరి మసీద్ రోడ్డు, రైతు బజార్ రోడ్డు తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు కార్యనిర్వాహక ఇంజనీర్, విజయవాడ టౌన్ బి.వి. సుధాకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.



విఎంసి స్పందనకు 22 అర్జీలు

ప్రజాశక్తి-విజయవాడ: ప్రజల వద్ద నుంచి స్వీకరిస్తున్న అర్జీల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ (జనరల్) యం శ్యామల, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కెవి సత్యవతి అన్నారు. స్థానిక విఎంసిలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. నగరంలోని ఆయా ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు వినతులు అందజేశారు. మొత్తం 22 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. సర్కిళ్ల కార్యాలయాలలో జోనల్ కమిషనర్ల అధ్యక్షతన జరిగిన స్పందన కార్యక్రమంలో ఆరు అర్జీలు వచ్చాయి.

సమస్యలపై ధైర్యంగా ఫిర్యాదు చేయండి : ఎస్‌పి

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : సమస్యలు తెలుపటానికి సంశయం వద్దని, ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేయవచ్చునని జిల్లా ఎస్పీ పి జాషువా అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన స్పందనలో వచ్చిన ఫిర్యాదులను స్వయంగా ఎస్పీ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులపై సత్వరమే చట్ట పరిధిలో పరిష్కారం అందించే దిశగా ప్రతి ఒక్క పోలీస్ అధికారి కృషి చేయాలని సూచించారు. నిర్ణీత సమయంలో సమస్యలను పరిష్కరించి ప్రజలకు అండగా పోలీసుశాఖ ఉందనే నమ్మకాన్ని పెంపొందించాలని కోరారు. సమస్యలను సావధానంగా విని, చట్టపరిధిలో సమస్యను పరిష్కరించే దిశగా పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

స్పందనలో స్వీకరించిన ఫిర్యాదులు:

వృద్ధాప్య సమయంలో కొడుకు ఉన్న ఇంటి నుండి గెంటేసి, కూడపెట్టుకున్న సొమ్మును నిర్దాక్షిణ్యంగా లాక్కొని రోడ్డుపాలు చేశాడని న్యాయం చేయమని గుడివాడ సరస్వతి(70) అనే వృద్ధురాలు ఫిర్యాదు చేసింది. కాళ్ల పారాని సైతం ఆరకుండానే శారీరకంగా మానసికంగా హింసిస్తూ, ఇంటి నుండి గెంటివేయాలని భర్త, అత్తమామలు తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నారని న్యాయం చేయమని తోట్లవల్లూరు నుండి వివాహిత నందిని ఫిర్యాదు చేసింది. స్థానిక ఇనుకుదురు నుండి సుందర్ పదవీ విరమణతో వచ్చిన సొమ్ముతో రమేష్ వ్యక్తి నివాస స్థలం కొనుగోలు చేసాడు, సంవత్సరం గడిచిన తర్వాత ఆదే స్థలం రమేశ్ కబ్జా చేసి బెదిరింపులకు పాల్పడుతున్నాడని, న్యాయం చేయమని కోరాడు. అన్న కొడుకు అని నమ్మి అనారోగ్య కారణాల దష్ట్యా నగదు అవసరమై స్థలం అమ్ముమని చెప్పగా, స్థలం అమ్మి కొంత సొమ్ము ఇచ్చి మిగిలిన సొమ్ము తర్వాత ఇస్తానని చెప్పి, ఇప్పుడు బెదిరిస్తున్నాడని న్యాయం చేయాలని కోడూరు నుండి వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్‌పి జాషువా

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గన్నవరం : బాపులపాడు మండలం వీరవల్లి గ్రామం వద్ద జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన సోమవారం జరిగింది. మృతి చెందిన వ్యక్తి వివరాలు లభ్యం కాలేదు. రహదారి భద్రత వాహన సిబ్బంది మృతదేహాన్ని గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.



కనీస వేతనం రూ. 15 వేలు ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి-ఉయ్యూరు : మండల పరిధిలో పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం నెలకు రూ. 15 వేలు ఇవ్వాలని సీఐటీయూ మండల కమిటీ ప్రధాన కార్యదర్శి సజ్జా బాలగంగాధర్ అన్నారు. గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం కనీస వేతనం రూ.15,000 ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం మండలపరి షత్ కార్యాల యంలో ఈ పీఆర్టీ మైథిలీని కలసి వినతిపత్రం అందజేశారు. జిల్లా నాయకుడు నరేశ్, ప్రజానాట్యమండలి కళాకారుడు గిద్దలూరి కోటేశ్వరరావు, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ బాజీబాబు తెల్లాకుల తదితరులు ఈవోపీఆర్డీని కలసి వినతి పత్రం అందజేసి ఉన్నారు.

డాక్టర్ పవన్ కళ్యాణ్‌కు జాతీయ స్థాయి అవార్డు

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు పిన్నమనేని నర్సింగ్ హోమ్‌కు చెందిన ప్రముఖ పిల్లల వైద్య నిపుణుడు పిన్నమనేని పవన్ కళ్యాణ్‌కు జాతీయ స్థాయిలో ఐఏపీ అవార్డు లభించింది. గుజరాత్ లోని గాంధీనగర్ లో ఈనెల 19 నుంచి 23 వరకు జరిగిన 30వ ఇండియన్ అకాడమి ఆఫ్ పీడియాట్రిక్ అండ్ 60వ పెడికాన్ 2003 సదస్సులో డాక్టర్ పవన్ కళ్యాణ్ అవార్డు అందుకున్నారు. ఐఏపీ అసోసియేషన్ నుంచి అవార్డు అందుకున్న అతి తక్కువ మంది యువ వైద్యుల్లో జాతీయ స్థాయిలో పవన్ కళ్యాణ్ ఒకరు కావడం విశేషం. పవన్ కళ్యాణ్ తాత డాక్టర్ కనకమేడల రంగారావు ప్రముఖ పేదల వైద్యుడిగా గతంలో సేవలందించి పేరు ప్రఖ్యాతులు గడించగా, తండ్రి డాక్టర్ చంద్రమోహన్, తల్లి డాక్టర్ కస్తూరి ప్రముఖ వైద్యులుగా పేరొందారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలువురు వైద్యులు, ఐఏపీ అధ్యక్షుడు డాక్టర్ ఉపేంద్ర కింజివిడేకర్, డాక్టర్ నవీన్ ఠాకరే, వినోద్ సక్సేనా నుంచి పవన్ కళ్యాణ్ అవార్డు అందుకున్నారు.

ఆస్థాన మండప నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలోని శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా రూ 25 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఆస్థాన మండప నిర్మాణానికి ఆలయ ధర్మకర్త పోతరాజు భాస్కరరావు ఈవో పి సీతారామయ్య సోమవారం భూమి పూజ చేశారు. ఈ మండపం లో స్వామివారికి విశేష పూజలు ఉంజల్ సేవ సమనోత్సవ కార్యక్రమాలు వినియోగించుకోనేందుకే ఈ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కేవలం ధర్మకర్తల మండలి కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో ఈ నిర్మాణం జరుగుతున్నట్లు భాస్కరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆగమ పండితులు దివి పార్థ వెంకట రామ శ్రీనివాస్ ఆచార్యులు భూమి పూజ జరపగా అర్చక స్వాములు దివి వెంకట్రామాచార్యులు, అప్పలాచార్యులు బి వేణుగోపాలాచార్యులు, వేణుగోపాలరావు పాల్గొన్నారు

నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తే శిక్ష తప్పదు : జడ్జి



ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తే చట్ట ప్రకారం శిక్ష తప్పదని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి, కెవిఆర్ కష్టయ్య పేర్కొన్నారు. రహదారి భద్రతలో భాగంగా కృష్ణా జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కృష్ణవేణి ఐటిఐ కాలేజీలో లో రహదారి భద్రత అవగాహనా కార్యక్రమమును నిర్వహించారు. ఈ కార్యక్రమనకు ముఖ్య అతిథిగా హాజరైన కష్టయ్య మాట్లాడుతూ ప్రతి పౌరుడికి రాజ్యాంగంలో ఎన్నో హక్కులు కల్పించారని, ఒక్కరు వాటిని తెలుసుకోవాలన్నారు. అలాగే ప్రతి వాహన దారుడు డ్రైవింగ్ చేసే టప్పుడు చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ద్వారా ఆర్థికంగా వెనుకబడిన, నిరక్షరాస్యులకు ఉచిత న్యాయ సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖ అధికారి పి సీతాపతి రావు, రవాణా శాఖాధికారులు లియావత్ సిద్దిక్, యమ్.వి.ఐ. బి.యస్.యస్. నాయక్, ఐ టి ఐ కాలేజ్ ప్రిన్సిపాల్ కె. రమేష్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టడం అమానుషం



ప్రజాశక్తి-గన్నవరం : రాష్ట్రంలో వైసీపీ అరాచకాలను ప్రజలంతా గమనిస్తున్నారని టిడిపి గన్నవరం కన్వీనర్, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు అన్నారు. టిడిపి కార్యాలయంపై దాడి కేసులో ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్న రాష్ట్ర తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మూల్పూరు సాయి కళ్యాణి కుటుంబ సభ్యులను కృష్ణా జిల్లా బాపులపాడు గ్రామంలోని సాయి కళ్యాణి, భర్త మూల్పూరు సురేంద్ర కుమార్‌లను పరామర్శించి ధైర్యం చెప్పారు. స్థానిక పోలీసులు దాడి చేసిన వైసీపీ గూండాలను వదిలేసి దెబ్బలు తిని బాధితులుగా ఉన్న 18 మంది గన్నవరం నియోజకవర్గ టీ డీ పీ కీలక నేతలపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టడం చాలా అమానుషం అన్నారు. ఈ కార్యక్రమంలో సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకష్ణారావు, రాష్ట్ర తెలుగు రైతు కార్య నిర్వాహక కార్యదర్శి గుండపనేని ఉమా వరప్రసాద్, కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు, నియోజకవర్గ కమిటీ సభ్యులు బచ్చుల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇదే కేసులో అజ్ఞాతంలో ఉన్న జిల్లా తెలుగు యువత నాయకులు గుండపూడి నితీష్ కుమార్ కుటుంబ సభ్యులు బొమ్ములూరు గ్రామంలో కొనకళ్ల నారాయణరావు పరామర్శించారు.

మహా చండీయాగం

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు గ్రామ ప్రజలు చల్లగా ఉండాలని, గ్రామంలో సుభిక్షంగా పంటలు పండాలని, చిన్న పెద్ద అందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుతూ శ్రీ గంగానమ్మ ఆలయం వద్ద మహా చండీయాగాన్ని నిర్వహించారు. కొల్చిన వారికి కొంగుబంగారమై విరాజిల్లుతున్న శ్రీ గంగమ్మ అమ్మవారి ఆలయ11వ పునర్ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ ప్రాంగణంలో ఆలయ ప్రధాన అర్చకులు కొమ్మూరు శ్రీను గురు స్వామి ఆధ్వర్యంలో నాలుగు హోమగుండాలతో 16 మంది దంపతులచే వేద పండితుల మంత్రో చరణతో మహా చండీయాగాన్ని నిర్వహించారు. అనంతరం ఎనిమిది వేల మంది భక్తులకు భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయం వద్ద ఏర్పాట్లను ఆలయ చైర్మన్ కోట యుగంధర్ రావు పర్యవేక్షించగా వేలాదిమంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఆక్వా కల్చర్ చెరువులన్నీ జోన్లో చేర్చాలి

ప్రజాశక్తి-నాగాయలంక : జిల్లాలోని ఆక్వాకల్చర్ చేసే చెరువులన్నీ ఆక్వా జోన్లో చేర్చాలని బిసి నేత, ఏపి సాంప్రదాయ మత్స్యకారుల సేవా సంఘం ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన నాగాయలంక లో విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వానికి సంబంధించిన, ఏ ద్యుబ్బ్యిడ్,యూడబ్ల్యూడి, పిడబ్ల్యుడి తదితర ప్రభుత్వ భూములలో ఆక్వా కల్చర్ చేసే చెరువులన్నింటిని ఆక్వా జోన్ లో చేర్చ రాదంటు ప్రభుత్వం 2023లో ఇచ్చిన జీవో వలన సన్న,చిన్న కారు ఆక్వా రైతులకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వీరిలో అధిక శాతం మంది బిసి, ఎస్‌సి, ఎస్‌టి వంటి పేద వర్గాలకు చెందిన వారేనన్నారు. వీరు అందరూ చేసే ఆక్వా కల్చర్ ఉత్పత్తుల వలనే దేశానికి కోట్లాది రూపాయల విదేశీ మారక ద్రవ్య లభిస్తుందనే విషయాన్ని ప్రభుత్వం మరవటం దురదష్ట కరం అన్నారు. వివక్ష లేకుండా కల్చర్ చేసే ఆక్వా చెరువులన్ని ఆక్వా జోన్ లో చేర్చి ప్రభుత్వం కల్పించే అన్ని రాయితీలు వర్తింప చెయ్యాలనీ లకనం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తూముల బిల్లులు చెల్లించొద్దు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం పంచాయతీ పరిధిలో గతంలో వేసిన తూముల బిల్లులు, కొత్తగా తూములు కొనుగోలు చేయడానికి ప్రతిపాదన బిల్లులు చెల్లింపుకు పంచాయతీ బోర్డు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ్యులంతా వ్యతిరేకించారు. తూములకు సంబంధించిన బిల్లులు చెల్లించడానికి వీల్లేదని, ఆ సమస్య డిపిఓ వద్ద పెండింగ్లో ఉందని కొంతమంది సభ్యులు చెప్పారు. సోమవారం గన్నవరం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నిడమర్తి సౌజన్య అధ్యక్షతన పాలకవర్గ సమావేశం జరిగింది. పంచాయతీ కార్యదర్శి బాపూజీ తీర్మానాలను బోర్డులో ప్రవేశపెట్టారు. ప్రైవేటు చెత్త ట్రాక్టర్ల కాంట్రాక్ట్ గడువు మార్చి 31 తో ముగుస్తున్నందున, వాటిని కొనసాగించాలని పెట్టిన తీర్మానాన్ని సభ్యులు వ్యతిరేకించారు. అవసరమైతే కొత్త ట్రాక్టర్ ను సబ్సిడీలో కొనుగోలు చేసి పంచాయతీలో పెట్టుకోవచ్చు గానీ పాత ప్రైవేటు ట్రాక్టర్లను పెట్టడానికి వీలు లేదని కొంతమంది సభ్యులు స్పష్టం చేశారు. పంచాయితీ సిమెంట్ బల్లల కొనుగోలు, బిల్లుల చెల్లింపు తీర్మానాన్ని ప్రవేశపెట్టగా దానిని వ్యతిరేకించారు. బోర్డులో తీర్మానం చేయకుండా సిమెంటు బల్లలు ఎందుకు తెచ్చారు, ఎక్కడ వేశారని కొంతమంది ప్రశ్నించారు. దానికి కార్యదర్శి సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. కొత్తగా ఐదు చోట్ల బోర్లు వేయడానికి, పాత బోర్ పంప్ సెట్ లు రిపేర్లు చేయడానికి తీర్మానం పెట్టగా అధికారుల నుండి ప్రతిపాదనలు తీసుకున్న తర్వాత ఆ పనులు చేపట్టాలని సభ్యులు చెబుతూ తీర్మానం చేయించారు. పారిశుధ్య రిక్షాల రిపేర్లకు, సచివాలయాల నిర్వహణకు, వీధిలైట్ల కొనుగోలుకు వంటి సంబంధించిన బిల్లులను ఆమోదించారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ పాలడుగు నాని, గుమస్తా దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబాలకు సాయం

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : కృష్ణా జిల్లా హోంగార్డ్స్ విభాగంలో విధులు నిర్వర్తిస్తూ పదవి విరమణ, రహదారి ప్రమాదంలో మరణించిన హోంగార్డుల కుటుంబాలకు జిల్లా హోంగార్డ్స్ వన్డే కాంట్రిబ్యూషను సోమవారం ఇరు కుటుంబాలకు జిల్లా ఎస్పీ పి.జాషువా అందజేశారు. నవంబరు 2022లో పదవి విరమణ చేసిన హోంగార్డు జిబిఎస్ఎన్ ప్రసాదుకు హోంగార్డ్స్ ఒకరోజు వేతనం రూ 3,85,530, అలాగే జనవరి 1వ తేదీన రహదారి ప్రమాదంలో మరణించిన హోంగార్డ్ జి నాంచార్యయ్య భార్య లక్ష్మీసరస్వతికు హోంగార్డ్స్ ఒకరోజు వేతనం రూ 3,79,140 సహాయం చెక్కుల రూపంలో ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు, ఇబ్బందులు ఎదురైనా ధైర్యంగా తెలుపు కోవచ్చన్నారు.



చెక్కు అందిస్తున్న ఎస్‌పి పి.జాషువా

సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి కోడూరు : కోడూరు గాంధీ బొమ్మల సెంటర్లో గత 16 రోజులుగా జనసేన పార్టీ సీనియర్ నాయకులు ఉల్లి శేషగిరిరావు ఆధ్వర్యంలో జరుగుచున్న జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో సోమవారం జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు బండ్రెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు. పలువురు జనసేన అభిమానులకు ఆయన చేతుల మీదుగా సభ్యత్వ నమోదు చేశారు. అనంతరం కోడూరు శ్రీ గంగాభవాని ఆలయం వద్ద జరిగిన మహా చండీయాగంలో పాల్గొని అమ్మవారిని దర్శించారు.

ఆదర్శనీయం మహాత్ముని జీవితం

ప్రజాశక్తి-వన్‌టౌన్: మహాత్మాగాంధీ జీవితం విద్యార్థులకు ఆదర్శప్రాయమని కష్ణా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.రామమోహనరావు అన్నారు. సోమవారం తాడేపల్లిలోని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విజయవాడ సయ్యద్ అప్పలస్వామి కళాశాల ప్రాంగణంలోని మహాత్మా గాంధీ దేవాలయానికి సంబంధించిన గాంధీ అష్టపంచ దశావతార పంచశతి నామావళి పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కష్ణా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.రామిరెడ్డి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు రాంపిళ్ల నరసాయమ్మ, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ కార్యదర్శి గోళ్ల నారాయణరావు, ఇండియన్ సివిలైజేషన్ గాంధీ ట్రస్ట్ డైరెక్టర్లు తమ్మిన సోనియా, తమ్మిన హనుమ, సయ్యద్ అప్పలస్వామి కళాశాల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ దండాబత్తిన సరళ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విసి

ఆ భూములు పేదలివే : సిపిఎం

ప్రజాశక్తి-మైలవరం: మైలవరంలోని సర్వే నెంబర్లు మారిన భూములు పేదలవేనని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ అన్నారు. దళితుల భూములకు రక్షణ కల్పించాలని సోమవారం జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1974లో పేదలకు ఇచ్చిన భూ సర్వే నెంబర్లు ఇప్పుడు ఎందుకు మాయమయ్యాయో అధికారులు జవాబు చెప్పాన్నారు. కొంతమంది పెత్తందారులు అధికారులను ఒత్తిడి చేసి రికార్డులు తారుమారు చేసి పేదల భూములను దళితుల నుండి దూరం చేస్తున్నారన్నారు. దీనిపై జెసి మాట్లాడుతూ రెండు రోజుల్లో సమస్య పరిష్కారానికి కషి చేస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రావురి రమేష్, సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్.సుధాకర్, భూ పోరాట కమిటీ సభ్యులు తమ్ముంద్రు యేసు, యోహాను, లాజరు, జానీ, ఓలేటి వెంకయ్య, నూతక్కి. శేఖర్, సదా హునిస తదితరులు పాల్గొన్నారు.



'గ్రీన్‌టెక్'ను తొలగించకపోతే ఉద్యమం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: చిత్తూరు జిల్లా పుంగనూరుకు చెందిన పారిశ్రామికవేత్త రామచంద్రయాదవ్ సోమవారం మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. షేర్‌మహమ్మద్‌పేట గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించిన అనంతరం గ్రీన్‌టెక్ కర్మాగారానికి చేరుకుని ప్రస్తుత పరిస్థితులను పరిశీలించి ఫ్యాక్టరీ నుండి నేరుగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారు. 15 రోజుల్లో కర్మాగారాన్ని తొలగించకుంటే చట్టపరంగా పోరాడతామని అన్నారు. ఫ్యాక్టరీ వల్ల అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతుంటే అధికార పార్టీ నాయకులు యాజమాన్యానికి వత్తాసు పలకడం దారుణమన్నారు. ఫ్యాక్టరీకి సమీపంలోని పాఠశాలలో 400 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, ఈ ఫ్యాక్టరీ వల్ల మూడు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పటికీ ఫ్యాక్టరీ యాజమాన్యం ఆరు నెలల్లో ఫ్యాక్టరీని తీసివేస్తామని చెబుతూ కాలయాపన చేయడం తగదన్నారు. ఇదే విధానం కొనసాగితే రానున్న కాలంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పచ్చిపాల నాగేశ్వరరావుయాదవ్, కాకనబోయిన నరసింహారావు, మెట్టెల రమణ, రామచంద్రుని పేట గ్రామ సర్పంచ్ మద్దుల రామకష్ణ, మాజీ ఉపసర్పంచ్ ఆంజనేయులు, దేవస్థానం కమిటీ చైర్మన్ ఏడుకొండలు పాల్గొన్నారు.



నాడు నేడు పనుల పరిశీలన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: వేదాద్రి గ్రామంలో నాడునేడులో భాగంగా మండల పరిషత్ స్కూల్లో రూ.48 లక్షలతో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను జగ్గయ్యపేట నియోజకవర్గ వైసిపి యువజన నాయకులు సామినేని వెంకట కృష్ణప్రసాద్‌బాబు సోమవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుడారు పేరయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్‌హెచ్ నర్సింగ్ కళాశాల వార్షికోత్సవం



ప్రజాశక్తి-హెల్త్‌యూనివర్శిటీ: రమేష్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రారంభించిన ఆర్‌హెచ్ నర్సింగ్ కళాశాల ప్రథమ వార్షికోత్సవ వేడుకలు, ఓత్ టేకింగ్ కార్యక్రమం పోరంకిలోని కళాశాల ప్రాంగణంలో సోమవారం ఘనంగా జరిగింది. కార్యక్రమాన్ని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి, రమేష్ హాస్పటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.రమేష్‌బాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం రాధికారెడ్డి మాట్లాడుతూ నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైనదని, రోగులకు సేవలను అందించడంలో నర్సుల పాత్ర అమోఘమని తెలిపారు. గొప్ప ప్రమాణాలతో నెలకొల్పిన కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులు గర్వించాలన్నారు. భవిష్యత్తులో రోగులకు, క్షతగాత్రులకు సేవలను అందించడంలో నర్సింగ్ విద్యార్థులు సన్నద్ధమవ్వాలన్నారు. రమేష్ హాస్పటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.రమేష్‌బాబు మాట్లాడుతూ దీపజ్యోతి విజ్ఞానానికి చిహ్నామని, మనలోనూ, మన సమాజంలోనూ ఉన్న అజ్ఞానాన్ని పారద్రోలేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మానవ సేవే మాధవ సేవగా భావించే నర్సింగ్ వైద్య విద్యను ఎంచుకున్నందుకు విద్యార్థులను అభినందించారు. ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసిన ఐదుగురు ఉత్తమ విద్యార్థులకు ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రత్యేక బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డలాక్టర్ వసుంధరాదేవి, ఫ్లోరెన్స్ నైటింగేట్ అవార్డు గ్రహీతలు ఉషాదేవి, ఝాన్సీరాణి, కళాశాల ప్రిన్సిపాల్ సోజీ ప్రవీణ్, అధ్యాపక బృందంతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

చెత్త డంపింగ్ యార్డు ప్రశ్నార్థకమేనా?

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ పట్టణంలో చెత్త డంపింగ్ యార్డ్ ప్రశ్నార్థకంగా మారింది. పట్టణంలో 50 వేల జనాభా ఉన్నారు. తడి, పొడి, ప్రమాదకర చెత్త అని మూడు రంగుల డస్ట్ బిన్స్ ఇచ్చి ఆయా వార్డుల్లో ప్రతి ఇంటికి నెలకు రూ.120 నుండి రూ.300 వరకు వసూలు చేయడాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. పట్టణంలో పోగైన చెత్తను నందిగామ డివిఆర్ కాలనీ వైపు కొంత, పల్లగిరి బ్రిడ్జి పక్కన, మామిడి తోటల పక్కనే పడేస్తుండటంతో దుర్గంధ వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డివిఆర్ కాలనీ పక్కన చెత్త డంపింగ్ వద్దని ఇటీవల ఒక మహిళ చంటి పాపను ఎత్తుకుని నిరసన తెలిపింది. మరో పక్క ప్రాముఖ్యత కలిగిన పల్లగిరి కొండ (శిలువ గిరి) వద్ద చెత్త డంపింగ్ చేసి కాలుస్తున్నారు. ఎంతో చరిత్ర కలిగిన శిలువ గిరి వద్ద చెత్త డంపింగ్ చేయడంపై ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అనాసాగరం 20వ వార్డులో శ్మశానవాటిక పక్కన చెత్త డంపింగ్ చేయడంపైనా ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అనాసాగరంలో శాశ్వత చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయానికి వచ్చి సుమారు రూ.50 లక్షలు కేటాయించినట్లు సమాచారం. అనాసాగరంలో ఇళ్ల మధ్య చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడంపై ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేసి జిల్లా కలెక్టర్ డిల్లీరావుకు ఫిర్యాదు చేయడం జరిగింది. నందిగామ శివారు ప్రాంతాల్లో ఎవరికీ ఇబ్బంది లేకుండా డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


తగలబడుతున్న చెత్త

64వ డివిజన్లో విష్ణు పర్యటన

ప్రజాశక్తి-సింగ్‌నగర్: 64వ డివిజన్ 284వ వార్డు సచివాలయ పరిధిలో సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మతో కలిసి పాల్గొన్నారు. బర్మా కాలనీలో విస్తతంగా పర్యటించారు. గత మూడున్నరేళ్ల కాలంలో సచివాలయ పరిధిలో రూ.7.15 కోట్ల సంక్షేమాన్ని నేరుగా లబ్ధిదారుల వ్యక్తిగత ఖాతాలలో జమ చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ డివిజన్ కోఆర్డినేటర్ ఎస్.కె.ఇస్మాయిల్, అధ్యక్షులు జిల్లెల్ల శివ, నాయకులు యరగొర్ల శ్రీరాములు, పందిరి వాసు, అనిల్, కొక్కిలిగడ్డ నాని తదితరులు సిబ్బంది పాల్గొన్నారు.

జుజ్జూరు మండల కేంద్రంగా తీర్మానం

ప్రజాశక్తి-వీరులపాడు: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపిపి కోటేరు వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జుజ్జూరు మండల కేంద్రంగా ఆమోదిస్తూ తీర్మానం ప్రవేశపెట్టారు. మొత్తం 14 మంది సభ్యులకు తొమ్మిది మంది హాజరైన ఈ సమాశంలో ఎనిమిది మంది మండల కేంద్రం మార్పునకు ఆమోదం తెలపగా ఒక్కరు మాత్రమే వ్యతిరేకించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో అరుంధతి దేవి, అన్ని గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



జగనన్న ఇళ్ల కాలనీల పరిశీలన



ప్రజాశక్తి-వన్‌టౌన్

పేదవాడి ఇంటికల కలగానే మిగిలిందని, నాలుగేళ్లు అవుతున్నా ఒక్క ఇల్లూ కట్టివ్వలేదని సిపిఎం పశ్చిమ సిటీ కార్యదర్శి, విజయవాడ 50వ డివిజన్ సిపిఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. విజయవాడ పశ్చిమ నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం వెదురుపావులూరు గ్రామంలో జగనన్న కాలనీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరానికి ఐదు కిలోమీటర్ల దూరంలో వందల ఎకరాలు పొలాలు ఉన్నా 25 కిలోమీటర్ల దూరంలో ఇళ్ల స్థలాలు సేకరించడం వల్ల పేదలకు మరింత భారమన్నారు. ఇంటి నిర్మాణానికి కనీసం రూ.5 లక్షలు ప్రభుత్వ సహాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జగనన్న కాలనీలో రోడ్లు, డ్రైన్లు, మంచినీటి సదుపాయం, విద్యుత్ సదుపాయం ఏర్పాటు చేయకుండా నాలుగు సంవత్సరాలు కాలయాపన చేశారన్నారు. పేదలు నివాసాలు ఏర్పాటు చేసుకొని ఎలా జీవిస్తారన్నారు. ఉచితంగా ఇల్లు నిర్మాణం చేసి ఇస్తామని చెప్పినటువంటి ప్రభుత్వం ఇప్పుడు మాట తప్పి పేదలని డబ్బు చెల్లించమని బలవంతం చేసి బెదిరించడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, మాజీ కార్పొరేటర్ గాదె ఆదిలక్ష్మి, సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కే.సూరిబాబు, ఐద్వా నగర నాయకురాలు వి.స్వప్న. సిఐటియు నాయకులు జి.శ్రీను, జి.దుర్గారావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు మరమ్మతులకు వినతి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని షేర్ మహమ్మద్ పేట నుండి గంద్రాయి వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేయాలని సోమవారం చిల్లకల్లు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కోటా కృష్ణ, దంతాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ట్రై సైకిల్ అందజేత

ప్రజాశక్తి-వన్‌టౌన్: 47వ డివిజన్‌కి చెందిన సవరపు దుర్గారావుకు రైల్వే బోర్డుమెంబర్ భీమరాజు మనోహర్ సహకారంతో ఏర్పాటు చేసిన మూడు చక్రాల సైకిల్‌ను సోమవారం విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శ్రీనివాస్ (నాని) అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు అమానుల్లా, జిల్లా ఉపాధ్యక్షులు లింగమనేని శివరామ ప్రసాద్, పరిశపోగు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాటినమ్ ఇవారా ఆభరణాలు

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: మహిళా దినోత్సవం సందర్భంగా ప్లాటినమ్ ఇవారా నుండి అద్భుతమైన ప్లాటినం ఆభరణాలను అందిస్తున్నట్లు ఇవారా షోరూమ్ ప్రతినిధి రామ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్లాటినం నుండి 95 శాతం స్వచ్ఛతతో తీర్చిదిద్దబడిన ఈ కలెక్షన్‌లో ప్రతి ఆభరణమూ ఓ ప్రత్యేక భావాన్ని వ్యక్తీకరించడం మాత్రమే కాకుండా మహిళలు మెచ్చే విధంగా డిజైన్లు ఉన్నాయని తెలిపారు. ఈకలెక్షన్స్‌లో ఆకర్షణీయమైన నెక్లెస్‌లు, ఆకట్టుకునే రిస్ట్‌వేర్, చెవి రింగులు, సొగసైన ఉంగరాలు ఉన్నాయని తెలిపారు. అన్ని ప్లాటినం ఇవారా షోరూమ్‌లలో లభ్యమవుతాయని తెలిపారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

ప్రజాశక్తి-విజయవాడరూరల్: రానున్న వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ముందస్తు గా చర్యలు చేపట్టినట్లు విజయవాడ రూరల్ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి తెలిపారు. నున్న గ్రామంలో రెండు కొత్త బోర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నున్నకు మండల పరిషత్ రూ.6 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. సోమవారం సర్పంచ్ కాటూరి సరళ అధ్యక్షతన జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో ఉప సర్పంచ్ కలకోటి బ్రహ్మానందరెడ్డి, సొసైటీ చైర్మన్ పొలారెడ్డి చంద్రారెడ్డి, డైరెక్టర్ భీమవరపు ముత్తారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి సాగర్ జలాలు నిలిపివేత

ప్రజాశక్తి-గంపలగూడెం: మంగళవారం నుండి ఎన్ఎస్‌పి రెండో జోన్ మధిర బ్రాంచ్ కెనాల్‌కు సాగర్ జలాలు నిలిపివేస్తున్నట్లు గంపలగూడెం మండల సాగర్ జలాల ఏఈ కిషోర్ తెలిపారు. పాలేరు రిజర్వాయర్ నీటిమట్టం పూర్తిగా తగ్గుముఖం పట్టిందని, దానిని పునరుద్ధరించేంత వరకు నీటిని నిలిపివేస్తున్నట్లు వివరించారు. అప్పటివరకు రైతులు పంటలపై అప్రమత్తంగా ఉండి తగిన చర్యలు తీసుకోవాలని కిషోర్ కోరారు.

క్రీడా దుస్తులు అందజేత

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని ఎస్‌జివిఎస్ కళాశాల గ్రౌండ్‌లో సామినేని వెంకట మల్లికార్జున ప్రసాద్ మెమోరియల్ (ఎస్‌విఎం ప్రసాద్) రాష్ట్రస్థాయి మహిళ ఆహ్వాన కబడ్డీ పోటీల్లో భాగంగా ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ఆధ్వర్యంలో సోమవారం 13 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులకు, కోచ్‌లకు క్రీడా దుస్తులను అందజేశారు.

పెండింగ్ అర్జీలను పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : జగనన్నకు చెబుదాం" ఎంతో ప్రాధాన్యత కార్యక్రమమని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా స్పష్టం చేశారు.కలెక్టరేట్లో సోమవారం కలెక్టర్ స్పందన నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి నేరుగా ముఖ్య మంత్రికి తెలియజేసేందుకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం త్వరలో ముఖ్యమంత్రి ప్రారంభించను న్నారన్నారు. స్పందన లాగిన్లోనే "జగనన్నకు చెబుదాం" క్లిక్ చేసి ఓపెన్ చేస్తే వివిధ శాఖలకు చెందిన ఆర్జీలు కనబడతాయన్నారు. వాటిని పరిశీలించి పరిష్కరిం చాలన్నారు. గడవు దాటిన వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామదర్శినిపై మాట్లాడతూ గ్రామదర్శినిలో గుర్తించిన సమస్యల పరిష్కారంతో పాటు గ్రామ అవసరాలు తెలుస్తాయని అన్నారు. అలాగే జిల్లాలో ఆధార్ అప్ డేషన్ కు సంబంధించి అత్యుత్తమ సేవలందించిన డిజిటల్ అసిస్టెంట్లకు జిల్లా కలెక్టర్ ఎ. పి. రంజిత్ షా ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ సచివాలయాల్లో ఆధార్ అప్డేడేషన్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇప్పటి వరకు జిల్లాలో 49,000 ఆధార్ ఆప్ డేషన్ సేవలు అందించినట్లు కలెక్టర్ తెలిపారు.

జిల్లాలో నియోజక వర్గ, మండలాల ప్రత్యేకాధికారుల నియామకం

జిల్లాలో వివిధ అసెంబ్లీ. నియోజక వర్గాలకు ఏర్పాటు చేసిన ప్రత్యేకాధికారుల జాబితా కలక్టర్ తెలియజేశారు. మచిలీపట్నం నియోజక వర్గానికి మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ పెడవకు బందరు ఆర్డివో, అవనిగడ్డకు డిఈఓ, పెనమలూరుకు డిఎంఅండ్ హెచ్, పామర్రుకు ఉయ్యూరు ఆర్ డిఓ, గుడివాడకు గుడివాడ ఆర్ డిఓ గన్నవరంకు డిసిహెచ్ఎస్ ప్రత్యేకాధికారులుగా ఉంటారన్నారు. అలాగే జిల్లా స్థాయిలో సుస్థిరాభివద్ధి లక్ష్యాలు మరియు స్పందనపై ఓరియంటేషన్ కం రీవ్యూ సమావేశం మార్చి 2వతేది విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరుగుతుందని, ఈ సమావేశానికి జిల్లాలోని తహలస్దిర్లు. ఎంపిడీవోలు, డివైఇవోలు, ఎంఇవోలు, సీడీపివోలు, స్టేషన్స్ పోలీస్ అధికారులు, డిఆర్డిఎ ఏరియా కో-



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

ఆర్డినేటర్లు, మండల వైద్యాధికారులతో పాటు సుస్థిరాభివద్ధి లక్ష్యాలు అమలు శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులు తప్పని సరిగా హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, డిప్యూటీ కలెక్టర్ కెఆర్ ఆర్ సి బి. నారాయణరెడ్డి, బందరు ఆర్ డివో ఐ కిషోర్, స్పందనలో పాల్గొని ప్రజల నుండి ఆర్జీలు స్వీకరించారు. ఈ సమావేశంలో డిఎం అండ్ హెచ్ వో డా. గీతాబాయి, డ్వామా పిడి జి.వి. సూర్యనారాయత, సిపితో వై.శ్రీలత, డిఎల్డీవో సుబ్బారావు, డిఇవో తాహెరా సుల్తానా, ముడా విసి రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఫస్ట్ ఎంపిఎ ప్రాయోగిక పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - మొవ్వ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి కళాపీఠంలో సోమవారం నుండి ఎంపిఏ మొదటి సంవత్సరం ప్రాయోగిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు మొత్తం 12 మంది విద్యార్థులు హాజరు కాగా ఎగ్జామినర్గా డాక్టర్ కె.వి.సుబ్రహ్మణ్యం వ్యవహరిం చారు. నట్టువాంగం పై డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు , గాత్రంపై డాక్టర్ వేదాంతం వెంకట దుర్గా భవాని , మదంగంపై పసుమర్తి హరినాథ శాస్త్రి సహకరించారు . ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి పర్యవేక్షించారు.

కుక్కలు, పందులను నియంత్రించాలని వినతి

ప్రజాశక్తి - మచిలీపట్నంఅర్బన్ : నగరంలో 50 డివిజన్లలోని ప్రజలు దోమలు, పందులు, కుక్కల బెడదతో పలు ఇబ్బందులకు గురి అవుతున్నారని, నియంత్రణకు చర్యలు తీసుకునేలా నగరపాలక సంస్థ కమిషనరును ఆదేశించాలని టిడిపి కార్పొరేటర్లు సోమవారం జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషాను కలసి వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా రాత్రి పూట నగరంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని తెలిపారు. కుక్కలు విపరీతంగా పెరిగి పాదచారులు, విద్యార్థులు వాహనదారులను వెంబడిస్తూ తీవ్ర గాయాలపాలు చేస్తున్నాయని చెప్పారు. అధికారులు వెంటనే స్పందించి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు. అలానే దోమల మందు జల్లి, కాల్వలు శుభ్రంగా ఉంచి, పందులను నివారించాలని పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సమత కీర్తి, డి అనిత, రాము, డి సుధాకర్లు ఉన్నారు.



వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

నూరుశాతం ఫలితాల సాధనకు కృషి

- కృష్ణాజిల్లా విద్యాశాఖాధికారి తహెరా సుల్తానా

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో కృష్ణాజిల్లా నూరు శాతం ఫలితాలు సాధించి మంచి స్థానంలో నిలిచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి తహెరా సుల్తానా సూచించారు. సోమవారం స్థానిక హిందూ కళాశాల ఆధ్వర్యంలో విద్యాశాఖా ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఓరియంటేషన్ క్లాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా తహెరా సుల్తానా మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఉపాధ్యా యులు చెప్పే సూచనలు పాటించాలని సూచించారు. సబ్జెక్టులలో మంచి మార్కుల సాధనకు అవసరమైన మెలుకువలు గురించి తెలియజేశారు. పరీక్షలకు



విద్యార్థులు ఏ విధంగా సిద్ధపడాలి ఆయ అంశాల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారులు యు వి సుబ్బారావు, పట్టణంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయాలి





ప్రజాశక్తి-చల్లపల్లి : చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పలువురు నేతలు ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక గుంటూరు బాపనయ్య శ్రామిక భవనంలో అవనిగడ్డ నియోజకవర్గం స్థాయి సదస్సును ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఏపీవ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండి ఆదిశేషు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కౌలురై సంఘం కార్యదర్శి పంచకర్ల రంగారావు మాట్లాడుతూ కేంద్రంలో రెండవసారి గద్దెనెక్కిన మోడీ ప్రజా సమస్యల పరిష్కరించడంలో విఫలం అయిందని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు రెట్టింపు రెట్టింపు ఆదాయాన్ని ఇస్తామని చెప్పిన ప్రభుత్వం మూడు నల్ల చట్టాలను తెచ్చి రైతులను బిచ్చగాళ్ళగా మార్చేందుకు ప్రయత్నం చేసిందని విమర్శించారు. 13 నెలల పాటు ఢిల్లీ పరిసరాలలో రైతుల ఉద్యమం చేసి మొండి మోడీ మెడలు వంచి చట్టలు రద్దు చేయించిన ఘనత రైతులకు దక్కిందన్నారు. పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ పథకం నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి అన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లేక ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ పరిపాలన చేస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు కార్మికులకు కర్షకులు రైతులు రోడ్డెక్కి పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. బిజెపి ప్రభుత్వ విధానాలను ఎండగొట్టేందుకే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. మరో ముఖ్య అతిథి ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మురాల రాజేష్ మాట్లాడుతూ ఏప్రిల్ 5వ తేదీన ఢిల్లీ పార్లమెంట్ ముట్టడికి రైతులు వ్యవసాయ కార్మికులు కూలీలు తరలిరావాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పచెంచేందుకు బిజెపి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తిప్పి కొట్టాలన్నారు. వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా 200 రోజులు పని కల్పించాలని రోజు కనీస వేతనం 600 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ డిమాండ్ చేశారు. నేడు దేశంలో పెరుగుతున్న ధరలకు అనుకూలంగా కూలీలకు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు ముర్రాపు పోలినాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ డీజిల్ పెట్రోల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆటో రంగానికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన చలోఢిల్లీ కార్యక్రమాన్ని గ్రామ గ్రామాన ప్రజలందరూ వివరించేలా కరపత్రాలు పంపిణీ చేయాలని జిల్లాసీనియర్ నాయకులు వై నరసింహారావు సూచించారు. జిల్ల కౌలు రైతు సంఘం నాయకులు వాకా రామచంద్రరావు, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు యద్దనపూడి మధు పాల్గొన్నారు

చింతలమడ కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలి : బుద్ధప్రసాద్



ప్రజాశక్తి-చల్లపల్లి : చింతలమడ దళిత కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా అందించాలని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. గత సంవత్సరం మే 26వ తేదీన కాసానగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు చింతలమడ దళిత వాసులు ఐదుగురు మృతి చెంది, 18 మంది తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. బాధిత కుటుంబాలకు వైఎస్ఆర్ బీమా సైతం నేటికీ అందకపోగా.. ప్రభుత్వం నుండి ఎటువంటి పరిహారం మంజూరు కాలేదు. చింతలమడ దళితులకు న్యాయం చేయాలని కోరుతూ టిడిపి ఆందోళన బాట పట్టింది. ఈ నేపథ్యంలో సోమవారం చల్లపల్లి తహశీల్దార్ కార్యాలయ వద్దనున్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద బాధిత కుటుంబాలు.. దళిత సంఘాలు దీక్ష చేపట్టాయి. దీక్షకు మద్దతు పలికిన ఉపసభాపతి మండలి బద్ధప్రసాద్ దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం జరిగి 9 నెలలు గడిచినా చింతలమడ దళితులకు నేటికి పరిహారం అందకపోవటం అత్యంత బాధాకరమన్నారు. సత్యాగ్రహ దీక్షకు మద్దతు పలికిన సిపిఎం పార్టీ మండల పార్టీ కార్యదర్శి యద్దనపూడి మధు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో మతి చెందిన, గాయపడిన చింతల మడ దళిత వాసులకు సహాయం అందించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.ఈ సత్యాగ్రహ దీక్షలో చింతలమడ బాధిత కుటుంబాలతో పాటు టీడీపీ దళిత సంఘాలు, టీడీపీ రాష్ట్ర నాయకులు కొనకళ్ళ బుల్లయ్య, పెడన ఇంచార్జ్ కాయిత కష్ణ ప్రసాద్ , నాయకులు...సీపీఐ.. జనసేన నేతలు తదితరులు సంఘీభావం తెలియజేశారు. తొలుతగా రోడ్డు ప్రమాదంలో మతి చెందిన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు

తాగునీటి సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : రానున్న వేసవి కాలంలో ముందస్తుగా ప్రతి గ్రామంలో తాగునీరు నిలవ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కొడాలి సురేష్ కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు మందిరంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పంచాయతీ అధికారులు తాగునీటి సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సభ్యులు అధికారుల దష్టికి తీసుకొచ్చిన సమస్యలపై అధికారులతో సమీక్షించి తక్షణమే పరిష్కరించేలా సూచనలు జారీ చేశారు. .ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దారపు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ శాయన పూర్ణ రవికుమార్, తాసిల్దార్ అబ్దుల్ రెహమాన్ మస్తానా, ఈవోపీఆర్డి కే దిలీప్ కుమార్, ఎంపీటీసీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ సమ్మాన్ నిధితో రైతులకు మేలు

ప్రజాశక్తి ఘంటసాల : చిన్న, సన్నకారు రైతులకు మేలు చేసేలా కేంద్ర ప్రభుత్వం కిసాన్ సమ్మాన్ నిధిని అందజేస్తుందని కషి విజ్ఞాన కేంద్రం ఇన్చార్జ్ ప్రొగ్రామ్ కో-ఆర్డినేటర్ డా.వి.మంజువాణి తెలిపారు. సోమవారం ఘంటసాలలోని కషి విజ్ఞాన కేంద్రంలో ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం రైతులకు, విద్యార్థులకు ప్రదర్శిం చారు. ఈ సందర్భంగా మంజువాణి మాట్లాడుతూ రైతుల వ్యవసాయ ఖర్చుల నిమిత్తం సంవత్సరానికి రూ.6 వేలు మూడు విడతలుగా రైతుల ఖాతాల్లో కేంద్ర ప్రభుత్వం నగదు జమ చేస్తుందన్నారు. తద్వారా ప్రతీ రైతు డబ్బును వ్యవసాయ ఖర్చుకు ఉపయోగించుకోవాలని తెలియజేసారు. ఈ కార్యక్రమం నిర్వహించిన కెవికె శాస్త్రవేత్త డా.బి.నవీన్ మాట్లాడుతూ రైతులు కిసాన్ సమ్మాన్ నిధి పొందటానికి అవసరమైన సూచనలు, రిజిస్ట్రేషన్ విధానాలు, లబ్ధిదారులుగా ఏ విధంగా నమోదు చేసుకోవాలనే విషయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా.కె.రేవతి. డా.ఎం.వెంకటలక్ష్మి, జి.కష్ణవేణి, రైతులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో క్రీడా స్ఫూర్తి అవసరం

(మొదటి పేజీ తరువాయి)

పథకాలను అర్హులందరికీ అందిస్తున్నారని, ఇది గిట్టని టిడిపి నాయకులు తమకు వంతపాడే పత్రికల ద్వారా అనేక తప్పుడు వార్తలను రాయిస్తున్నారని విమర్శించారు. ఎంఎల్ఎ సామినేని ఉదయభాను మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఎదుర్కొనే దమ్మూ ధైర్యంలేక టిడిపి నాయకులు, ఎల్లో మీడియా వారు ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో కెడిసిసిబి చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, నందిగామ ఆర్‌డిఒ రవీంద్ర, ఎంపిపి చెంబేటి వెంకటేశ్వర్లు, పెనుగంచిప్రోలు ఎంపిపి మార్కపుడి గాంధీ, వైస్ ఎంపిపి కాటేపల్లి రామలక్ష్మి, గ్రామ సర్పంచ్ భూక్య సీతమ్మ, జడ్‌పిటిసి సభ్యులు ఏసుపోగు దేవమణి, సొసైటీ అధ్యక్షులు రంగిశెట్టి ముత్తయ్య, వైసిపి సీనియర్ నాయకులు కాటేపల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



వత్సవాయిలో సొసైటీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి తానేటి వనిత, చిత్రంలో ఎంఎల్ఎ సామినేని ఉదయభాను తదితరులు




లబ్ధిదారుడికి తాళం చెవిని అందజేస్తున్న ఎమ్మెల్యే

లైవ్ ఫిష్ రవాణా వాహనం ప్రారంభం

ప్రజాశక్తి-అవనిగడ్డ : ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి సౌజన్యంతో ఫిష్ ఆంధ్ర బ్రాండ్ నుంచి ఏర్పాటు చేసిన లైవ్ ఫిష్ సప్లై చేయుటకు సుమారు రూ 12 లక్షల విలువగల టాటా ఏసీ వాహనాన్ని అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు సోమవారం అవనిగడ్డ పార్టీ కార్యాలయం వద్ద ప్రారంభించారు. చల్లపల్లి మండలం కి చెందిన కుంపటి శ్రీకాంత్ కు ఎస్ సి వారికి 60 శాతం సబ్సిడీ ప్లాన్ కింద ఈ వ్యాన్ అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకులు కడపకొల్లు నరసింహారావు, మాజీ సర్పంచులు నలుకుర్తి పధ్విరాజ్, సైకం భాస్కరరావు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-గన్నవరం : పార్టీలో నాయకులతో పాటు కార్యకర్తలకు ఏదైనా సమస్య వస్తే ఎమ్మెల్యే వంశీ అండగా నిలబడతారని జెడ్పిటిసి సభ్యులు ఎలిజబెత్ రాణి అన్నారు. ఎమ్మెల్యే డా.వల్లభనేని వంశీ రాజకీయ రంగప్రవేశం చేసిన తొలినాళ్ళ నుండి తనతోనే రాజకీయ ప్రయాణం కొనసాగిస్తూ ఇటీవల అనారోగ్యానికి గురైన సూరంపల్లి కి చెందిన నాయకుడు తాడిగడప రవిబాబు కు వైద్యసహాయం నిమిత్తం 25000 ఇచ్చారు. సోమవారం సదరు నగదును జడ్పిటిసి, పార్టీ నాయకుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎలిజబెత్ రాణి మాట్లాడుతూ.. గన్నవరం మండలం సూరంపల్లి గ్రామానికి చెందిన తాడిగడప రవిబాబు విద్యార్థి దశనుండి రాజకీయాలపట్ల ఆసక్తితో ఉండేవారని, విద్యారంగంలోకి ప్రవేశించి పరిసర గ్రామాలలోని విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన రవిబాబు "రవి మాస్టారు"గా గుర్తింపు పొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి ఎస్సీ సెల్ జిల్లా నాయకులు నిడమర్తి నాగేశ్వరరావు, నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కైలే శివ కుమార్, నీలం ప్రవీణ్ కుమార్, గోన్నూరు సీమయ్య, కలపాల అబ్రహం, చోడవరపు వెంకటేశ్వరరావు, జువ్వనపూడి కష్ణ తదితరులు పాల్గొన్నారు. అందరూ ఆసుపత్రిలో రవిని పరామర్శించారు.



ఉగాదిలోపు లక్ష్యాన్ని పూర్తి చేయాలి : కలెక్టర్


ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో ఇప్పటి వరకు 12 వేలకు పైగా గహాలు పూర్తయ్యాయని, ఉగాది లోపు జిల్లా వ్యాప్తంగా 4,800 ఇళ్ళు పూర్తి చేసి నిర్దేశించిన మొదటి లక్ష్యం16,877 ఇళ్ళు పూర్తి చేయాలని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు, డ్వామా, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.వి. సూర్య నారాయణతో కలిసి జిల్లాస్థాయి, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫెరెన్సు సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జగనన్న లేఅవుట్లలో గహ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. లే అవుట్లలో మౌలిక వసతుల ఏర్పాటుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వారం వారం లక్ష్యాలను నిర్ణయించుకుని ఆ మేరకు పూర్తి చేయాలని సూచించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ల నుంచి హౌసింగ్ అధికారుల వరకు అందరూ కలిసికట్టుగా పని



వీడియోకాన్ఫరెన్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

చేయాలన్నారు. వివిధ మండలాల్లో షిఫ్టింగ్ పోల్స్, నీటి వసతి తదితర అంశాలలో ఎంపీడీవోలు, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్లు ప్రత్యేక దష్టి సారించి పరిష్కరించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ, సాధికారిక అధికారిణి కె. సరస్వతి, మెప్మా, డిఆర్ డిఏ పిడి పిఎస్ ప్రసాద్, డిపిఓ నాగేశ్వరరావు, ఏడి సర్వే ఎస్ గోపాల్ రాజ్ , ఐసిడిఎస్ పిడి ఎస్.సువర్ణ, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎం ఫణి ధూర్జటి పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన



ప్రజాశక్తి -మొవ్వ : విద్యార్థులు భవిష్యత్ జీవితానికి ప్రణాళికా బద్ధంగా నిర్ణయాలు తీసుకొంటే ఉన్న స్థానం నుంచి ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని ప్రముఖ సైకాలాజిస్ట్, వ్యక్తిత్వ వికాస నిపుణులు జి. వినోద్ వెల్లడించారు. మొవ్వ మండల మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం కూచిపూడి, పెడసనగలు, భట్ల పెనుమత్రు హై స్కూల్స్ లో విద్యార్థుల కు కేరియర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు భవిష్యత్తు విద్య – ఉప యుక్తం ఆంశంపై అవగాహన కల్పించారు. మార్కులు కోసం కాకుండా రిమార్కులు లేని జీవితం కోసం విద్యార్థులు క్రమశిక్షణ, ప్రణాళిక అలవర్చుకోవాలన్నారు. పామర్రు మానవత రీజీయన్ ఛైర్మన్ పి.ఎంఎస్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం లో మొవ్వ మండల మానవత ప్రెసిడెంట్ పిట్టు శ్రీనివాస్ రావు, కోశాధికారి తాళ్లూరి మోహన్ కుమార్, పామర్రు మానవత కెరియర్ గైడెన్స్ కోర్డినేటర్ పామర్తి వెంకట నారాయణ తదితరులు ప్రసంగించారు. ఈ విద్యా సంవత్సరం లో మొత్తం సబ్జెక్ట్ లలో ప్రథమ, ద్వితీయ, తతీయ సాధించిన విద్యార్థుల కు బహుమతులు, జ్ఞాపికలు, ధవపత్రాలు, అందించడంతో పాటు విద్యర్థులందరికి వ్యక్తిత్వ వికాస పుస్తకాలను పంపిణీ చేశారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, కష్ణాజిల్లా శాఖ, వరం సివిల్ వర్క్స్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక మాచవరంలోని వరం సివిల్ వర్క్స్ అవరణలో సోమవారం బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంపును జిల్లా రెవిన్యూ అధికారి ఎం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం అంటే ప్రాణదానమేనన్నారు. ఆవకాశమున్న ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని కోరారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ టిఎస్ఎస్ బాలాజీ మాట్లాడుతూ వరం సివిల్ వర్క్ స్వచ్ఛందంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయటం సామాజిక సహ కలిగిన మంచి కార్యక్రమమని పేర్కొన్నారు. వరం అధినేత రామ్ నితీష్ తో పాటు పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ



కార్యక్రమంలో జేవీఎస్ సుబ్బారావు,రెడ్ క్రాస్ సెక్రటరీ శంకర్ నాథ్ భవిరి, కోశాధికారి రామ్ బాలాజీ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్స్ హనుమంతయ్య, కె వి శివ ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : కలెక్టర్

పజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి డ్రగ్ రహిత జిల్లాగా మార్చేందుకు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ భాష సూచించారు. డ్రగ్ ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దుటకు తీసుకుంటున్న చర్యల్లో బాగంగా అక్షర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో డీ అడిక్షన్ సెంటర్ సేవలకు సంబంధించి గోడపత్రికను కలెక్టర్ స్పందన సమావేశంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా కలక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి వారి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని యువత అటువైపు వెళ్లకుండా సంబంధిత అధికారులు, స్వచ్ఛంద సంస్థలు కషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు,ఆర్ డి ఓ, ఐ.కిషోర్, జిల్లా బద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ గీతా బాయి, డి అడిక్షన్ సెంటర్ వైద్యులు జి.శంకర్ ,తదితరులు ఉన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

జనసేన గ్రామ అధ్యక్షుల నియామకం

ప్రజాశక్తి-అవనిగడ్డ : జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఉమ్మడి కష్ణాజిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకష్ణ సూచనలతో అవనిగడ్డ మండలంలోని పది పంచాయతీలకు చెందిన గ్రామ పార్టీల అధ్యక్షు లను నియమించినట్లు ఆ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు గుడివాడ శేషుబాబు తెలిపారు. సోమవారం పార్టీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా గ్రామాల వారీగా పార్టీ అధ్యక్షుల పేర్లను ప్రకటించారు. అవనిగడ్డ గ్రామానికి రాజనాల వీరబాబు, పులిగడ్డ గ్రామానికి మండలి ఉదయభాస్కర్, రామకోటిపురంకు భూపతి బాలరేణుకయ్య, రామచంద్రపురంకు మతి మాఊరి కష్ణయ్య, దక్షిణ చిరుఓలులంకకు కమ్మిలి కష్ణ వేణుగోపాలరావు, మోదుమూడికు బచ్చు వెంకటనారాయణ, అశ్వరావు పాలెంకు దాసినేని నాగరాజు, పాత ఎడ్ల లంకకు నలిగిరి నరసింహారావు, వేకనూరుకు తుంగల వేణు, తుంగలవారిపాలెంక చుండూరు రమేష్‌లను నియమించినట్లు శేషుబాబు తెలిపారు. కాగా మోదుమూడి గ్రామ పార్టీ అధ్యక్షుడు బచ్చు వెంకట్ నారాయణ ఆధ్వర్యంలో 21 మందితో గ్రామ కమిటీ నీ ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోసూరి అవినాష్, అశ్వరావుపాలెం ఉపసర్పంచ్ ఎక్క టి నాగరాజు, రోహిత్ నాయుడు, రాజనాల వీరబాబు, బచ్చు వెంకటనారాయణ పాల్గొన్నారు



మృతుని కుమారునికి పిఎసిఎస్ సాయం

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి మండల పరిధిలోని మోపిదేవి లంక గ్రామానికి చెందిన రైతు మరణించడంతో మృతిని కుమారునికి నాగాయతిప్ప పిఎసిఎస్ తరపున తక్షణ సాయాన్ని అందజేశారు. మోపిదేవి లంక గ్రామానికి చెందిన మోర్ల తిరుపతి వెంకయ్య మరణించారు. వెంకయ్యకు నాగాయతిప్ప సొసైటీలో సభ్యత్వం ఉంది. దీనితో సోమవారం సొసైటీ కార్యదర్శి భోగాది లంకేశ్వం౯రావు ఆధ్వర్యంలో మోపిదేవి లంక గ్రామపంచాయతీ సర్పంచ్ మోర్ల జ్యోత్స్న మతుని కుమారుడు మోర్ల అంకమ్మ రావుకు పదివేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి మోర్ల శ్రీనివాసరావు, మండల పార్టీ బీసీ సెల్ కన్వీనర్ రాజులపాటి నాగేశ్వరరావు, సొసైటీ సిబ్బంది విశ్వనాథపల్లి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి



ప్రజాశక్తి -మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నంలో గత రెండు వారాలుగా 15 సంవత్సరాలలోపు పిల్లలకు విపరీతంగా జ్వరం, దగ్గు, జలుబు వంటి వ్యాధులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే "హెల్త్ ఎమర్జెన్సీ" ప్రకటించాలని లంకిశెట్టి బాలాజీ సోమవారం డిమాండ్ చేశారు. నగరం లో ప్రతి స్కూలులోనూ సగానికి పైగా అటెండెన్స్ పడిపోయిందని, స్కూళ్లలో పిల్లల మధ్య అంటు వ్యాధి లాగా వ్యాపిస్తూ పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని బాలాజీ తెలియజేశారు. ప్రభుత్వం స్కూళ్లను ఒక వారం పాటు సెలవులుగా ప్రకటించాలని జిల్లా కలెక్టర్ కు బాలాజీ విజ్ఞప్తి చేశారు. తక్షణమే మచిలీపట్నంలో ప్రత్యేక వైద్య శిబిరాలను, పిల్లల వైద్యుల నిపుణులను ఏర్పాటు చేసి పిల్లల ఆరోగ్యాన్ని కాపాడాలని బాలాజీ అన్నారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ: స్పందనలో ప్రజల నుండి స్వీకరించిన అర్జీలకు పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎస్. డిల్లీరావు, జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, డిఆర్‌వో కె. మోహన్‌కుమార్‌లు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను స్పందన దృష్టికి తీసుకువస్తే పరిష్కారమవుతాయనే దృక్పదంతో స్పందన ద్వారా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తున్నారన్నారు. అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కార మార్గాల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. అర్జీలను ఎప్పటికప్పుడు జాప్యం లేకుండా పరిష్కరించాలన్నారు. ఆఫ్ లైన్, ఆన్ లైన్‌లో నమోదవుతున్న అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు దృష్టి పెట్టాలన్నారు. స్పందనలో 94 వినతులు



అందాయి. జిల్లాలోని డివిజనల్ అధికారులు, ఆయా మండలాల యంపిడీవోలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో వర్చువల్‌గా జిల్లా కలెక్టర్ పరిష్కారమయ్యే వినతులను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌వో పి.కోమలిపద్మ, ఐసిడిఎస్ పీడి జి.ఉమాదేవి, డియంహెచ్‌వో డాక్టర్ యం.సుహాసిని వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



రాకేష్ స్కూల్ విజేతలకు అభినందన

ప్రజాశక్తి-వన్‌టౌన్: కెఎల్‌రావు నగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు వివిధ పోటీలలో పాల్గొని విజేతలుగా నిలిచారు. ఈ నేపథ్యంలో సోమవారం పాఠశాల డైరెక్టర్ ఎన్.వి.రావు ఆధ్వర్యంలో విజేతలకు అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఎన్.వి.రావు మాట్లాడుతూ విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అసోసియేషన్ నిర్వహించిన వివిధ పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు 21 మంది విజేతలుగా నిలిచి బహుమతులు సాధించటం గర్వకారణమన్నారు. అలాగే ఇటీవల వన్‌టౌన్ కొత్తపేటలోని కెబిఎన్ కళాశాల నందు జరిగిన వివిధ పోటీలలో ముగ్గురు విద్యార్థులు విజేతలుగా నిలిచారని తెలిపారు. బెంగుళూరులో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో కూడా తమ విద్యార్థిని బహుమతి సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.రమేష్, జి.మల్లీశ్వరీ, ఎస్.కాంతి కల్పన, ఎస్.కె.షకీల, జె.ఝాన్సీ. మమత తదితరులు పాల్గొన్నారు.

కెటి రోడ్డును పూర్తి చేయాలి : పోతిన

ప్రజాశక్తి-వన్‌టౌన్ : జనసేన పార్టీ బ్యానర్లు తొలగించడంపై ఉన్న దష్టి కెటి రోడ్డు నిర్మాణంపై లేదని జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన వెంకట మహేష్ విమర్శించారు. సోమవారం కేటీ రోడ్డును సందర్శించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ కెటి రోడ్డు నిర్మాణం ప్రారంభించి సంవత్సరాలు గడుస్తున్నా ఎప్పటికీ పూర్తవుతుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. బస్సులు, అంబులెన్స్‌లు తిరిగి ఏడాది కాలమైందని, స్కూల్ పిల్లలు, ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు, రోజువారి పనులు చేసుకునే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. రెండేళ్ల నుంచి వైసిపి ప్రభుత్వం, విఎంసి అధికారులు ఒక ప్రధాన రోడ్డు నిర్మాణం పూర్తి చెయ్యలేకపోయారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బత్తుల వెంకటేష్, రెడ్డిపల్లి గంగాధర్, పొట్నూరి శ్రీనివాస్‌రావు, చేనేత డివిజన్ అధ్యక్షులు ఆకుల రవిశంకర్, నగర కమిటీ నాయకులు మొబీనా సబిన్కర్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ మండపాల నిర్మాణానికి రూ.1.73 కోట్లు

ప్రజాశక్తి-భవానీపురం: స్థానిక భవానీపురంలో గల ఎన్టీఆర్ జిల్లా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు వివిధ కులాలకు చెందిన కళ్యాణ మండపాల నిర్మాణానికి కోటి 73 లక్షల 8 వేల రూపాయలు ఎమ్మెల్యే నిధులు కేటాయిస్తూ అయా నిధుల పత్రాలను అయా కుల సంఘ ప్రతినిధులకు సోమవారం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వెలంపల్లి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నియోజకవర్గంలో వివిధ కులాల వారి వారి కళ్యాణ మండపాల నిర్మాణానికి ఎమ్మెల్యే నేడు విడుదల చేయడం జరిగిందని, ఆ పత్రాలను ఈ రోజు అందించినట్లు చెప్పారు. ఆయా కుల సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ వెలంపల్లి ఇచ్చిన మాట తప్పకుండ మా కుల సంఘాల కల్యాణ మండపాల నిర్మాణానికి తన ఎమ్మెల్యే నిధులు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు బుల్లా విజయ్ కుమార్, శీరంశెట్టి పూర్ణచంద్రరావు, మరుపిళ్ల రాజేష్, ఎం.డి ఇర్ఫాన్, మైలవరపు దుర్గారావు, ఆయా కుల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించండి

ఎన్‌టిఆర్ జిల్లా డిఎంహెచ్ఒకు యూనియన్ నేతల వినతి

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్ : ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన సోమవారం ఎన్‌టిఆర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డిఎంఅండ్‌హెచ్ఒ) ఎం.సుహాసినికి వినతిపత్రం సమర్పించారు. విజయవాడలోని డిఎంహెచ్ఒ కార్యాలయంలో ఆమెను యూనియన్ జిల్లా నాయకులు ఎ.కమల, పి.శ్రీలక్ష్మి, పద్మ, శివకుమారి కలిసి ఆశా వర్కర్లకు సంబంధంలేని ఏ ఇతర పనులను వారితో చేయించొద్దని కోరారు. జిల్లా అంతా ఒకే నిర్వహణ రిజిస్టర్ అమలు చేయాలని, ఆశాలు మెయింటైన్ చేసే రిజిస్టర్లను వైద్య ఆరోగ్య శాఖ నుండి ఇవ్వాలని, ఆశ వర్కర్లకు అనారోగ్యం లేదా అత్యవసర సమయాల్లో పర్మిషన్లు, సెలవులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. జిజిహెచ్‌కు కేసులు తీసుకెళ్తున్న ఆశాలకు రెస్ట్‌రూమ్ సౌకర్యం కల్పించాలని వినతిపత్రంలో కోరారు.



వినతిపత్రం సమర్పిస్తున్న ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు ఎ.కమల, పి.శ్రీలక్ష్మి, పద్మ, శివకుమారి



సస్పెన్స్ కథతో 'గ్రంథాలయం'

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: సస్పెన్స్, థ్రిల్లర్స్‌తో పాటు యాక్షన్ సీక్వెన్స్‌తో గ్రంథాలయం సినిమా ప్రతిఒక్కరినీ ఆకట్టుకుంటుందని చిత్ర దర్శకుడు జంపాన సాయి శివన్ తెలిపారు. గ్రంథాలయం చిత్రం ప్రమోషన్‌లో భాగంగా సోమవారం సాయంత్రం నగరంలోని ఓ హోటల్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైష్ణవి శ్రీ క్రియేషన్స్ పతాకంపై నిర్మిస్తున్న గ్రంథాలయం చిత్రం మార్చి 3వ తేదీన తెలుగు రాష్ట్రాల్లో రిలీజ్ కానుందని తెలిపారు. గ్రంథాలయం చిత్రం పూర్తి స్థాయి థ్రిల్లర్ సస్పెన్స్‌తో కూడుకున్న చిత్రమని తెలిపారు. ఈచిత్రం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటుందని తెలిపారు. ప్రతి సన్నివేశాన్ని చక్కగా తీశామని గ్రంథాలయంలో జరిగే సన్నివేశాలు ప్రేక్షకులను ఉత్కంటకు గురిచేస్తాయన్నారు. హీరో విన్ను మద్దిపాటి మాట్లాడుతూ గ్రంథాలయం సినిమా టీజర్‌కు ప్రేక్షకుల వద్ద నుండి మంచి స్పందన వస్తుందన్నారు. దర్శకుడు ప్రతి అంశాన్ని చక్కటి నైపుణ్యతతో తీశారని తెలిపారు. హీరోయిన స్మిరిత రాణి మట్లాడుతూ తెలుగులో తన మొదటి చిత్రం గ్రంథాఇలయం అని ఈచిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిత్ర నిర్మాత అయ్యప్ప పాల్గొన్నారు.

హెచ్‌సిఎల్ ఫౌండేషన్ గ్రాంట్ ప్రకటన

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: హెచ్‌సీఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెచ్‌సీఎల్ గ్రాంట్‌ను గ్రహీతలకు విడుదల చేసినట్లు సంస్థ చైర్ పర్సన్ రాబిన్ అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం వివిధ కార్యక్రమాలను నిర్వహించేందుకుగాను హెచ్‌సీఎల్ సంస్థ గ్రాంట్‌ను అందిస్తుందన్నారు. మూడు ఎన్‌జివోలు ప్లానెట్ ఎర్త్ న ఇన్నోవేటర్స్, ఇన్‌హెల్త్ సంస్థలకు గ్రాంట్‌ను అందించినట్లు తెలిపారు. వీరు ఈగ్రాంట్ ద్వారా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారని ప్రదానంగా పర్యావరణం, ఆరోగ్యం, విద్యా రంగాలలో వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తారని తెలిపారు.

దాల్మియాకు రివ్యూ సిమెంట్ అవార్డు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ప్రముఖ సిమెంట్ కంపెనీ దాల్మియా సిమెంట్‌కు ఇండియన్ రివ్యూ సిమెంట్ అవార్డును సాధించినట్లు సంస్థ కంపెనీ యూనిట్ హెడ్ ముకేష్ సిన్హా ఒక ప్రకటనలో తెలిపారు. పర్యావరణ అనుకూల ప్రక్రియలతో పాటుగా నిర్వహణ, కార్యకలాపాల శ్రేష్టత వంటివి తమ సంస్థ వృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుంటా యన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 13వ సిమెంట్ ఎక్స్‌పోలో జరిగిన సిమెంట్ కాన్ఫరెన్స్‌లో అవార్డును అందజేశారని తెలిపారు.

5న వాహనాలు వేలం

ప్రజాశక్తి-భవానీపురం: భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కేసులలో సీజ్ చేయబడిన వాహనాలను మార్చి 5వ తేదీన వేలంపాట నిర్వహించనున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎం.డి.ఉమర్ తెలిపారు. సాయంత్రం 3 గంటలకు వాహనాల వేలం పాట నిర్వహించబడునని, వేలం పాటలో పాల్గొనుటకు ఆసక్తి ఉన్న వారు టూ వీలర్‌కు రూ.5 వేలు, ఫోర్ వీలర్‌కు రూ.10 వేలు ముందస్తుగా డిపాజిట్ చెలించాలని కోరారు. అలాగే వేలంలో వాహనం పాడుకున్న వారు 18 శాతం జిఎస్‌టి తప్పకుండా చెల్లించాలని తెలిపారు. వివరాలకు హెచ్‌సి బాలయ్య 9490964949, రైటర్ శ్రీనివాస్ 9951343344, ఉమర్ 9440796489ను సంప్రదించాలని కోరారు.

రూ.30 కోట్లతో అన్నదాన భవనం నిర్మాణం

• ఇక నుండి ఉచిత చెప్పుల స్టాండ్ • దుర్గగుడి పాలక మండలిలో పలు తీర్మానాలు ఆమోదం

ప్రజాశక్తి-వన్‌టౌన్: మల్లిఖార్జున మహామండపం దిగువ ఖాళీస్థలంలో రూ.30 కోట్ల ఖర్చుతో అన్నదాన భవనం నిర్మించేందుకు పాలకమండలి ఆమోదం తెలిపినట్లు పాలకమండలి ఛైర్మన్ కర్నాటి రాంబాబు చెప్పారు. సోమవారం వన్‌టౌన్ బ్రాహ్మణ వీధిలోని జమ్మిచెట్టు వద్ద వున్న దేవస్థానం కార్యాలయంలో నూతనంగా నియమించబండిన పాలకమండలి మొదటి సమావేశం జరిగింది. అనంతరం చైర్మన్ కర్నాటి రాంబాబు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సమావేశంలో 18 అజెండాలపై చర్చించి ఆమోదం తెలిపామన్నారు. అందులో ముఖ్యంగా అన్నదాన భవనాన్ని జి ప్లస్ టూ గా నిర్మిస్తామని చెప్పారు. అలాగే కనకదుర్గా నగర్ నుంచి మహామండపం వరకూ రూ.13 కోట్లతో వ్యయంతో ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్ నిర్మించాలని తీర్మానించామన్నారు. దుర్గమ్మ దర్శనానికి వచ్చే యాత్రికుల కోసం దుర్గా ఘాట్ నుంచి కొండపైకి, అలాగే కొండపై నుంచి దుర్గాఘాట్ వరకూ ఉచితంగా రెండు బస్సులను నడపాలని నిర్ణయించామన్నారు. అమ్మవారికి లక్ష రూపాయలుకు పైగా విరాళం ఇచ్చిన వారి కుటుంబాలకు నెలలో ఒకసారి ఉచితంగా అంతరాలయ దర్శనం చేయిస్తామని, కొండపైన, కొండ దిగువన ఉచితంగా చెప్పులస్టాండ్ నిర్వహించాలని తీర్మానం చేసామన్నారు. ఎండాకాలం దృష్ట్యా కొండపైన, కనకదుర్గ నగర్‌లో చలువపందిళ్ల ఏర్పాటుకు తీర్మానం చేశామన్నారు. హారతుల టిక్కెట్‌పై వచ్చే యాత్రికులకు లడ్డూ ప్రసాదం అందజేస్తామన్నారు. దర్శనానంతరం బయటకు వచ్చే ప్రతి యాత్రికునికి 'సటారి' ఇచ్చే విధంగా ఏర్పాటు చేస్తామని, అలాగే ప్రతి యాత్రికుడికి కుంకుమ ప్రసాదం పొట్లం అందేలా తీర్మానం చేశామన్నారు. సమావేశంలో దుర్గగుడి ఈవో డి.భ్రమరాంబ, పాలకమండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రాంబాబు